క్లుప్తంగా

సాగరతీరం.. పరిశుభ్రం



యారాడ బీచ్‌లో చెత్తను తొలగిస్తున్న నేవీ అధికారులు

పెదగంట్యాడ: తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తూర్పు నావికాదళ అధికారులు తెలిపారు. పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యారాడ, భీమిలి, ఆర్కే బీచ్‌లతో పాటు మేఘాద్రిపేట నదీ పరివాహక ప్రాంతంలో శనివారం చెత్తాచెదారాన్ని తొలగించారు. అన్ని ప్రాంతాల్లో కలిపి మొత్తం 700 కిలోల చెత్తాచెదారాన్ని ఏరివేశారు. కోస్టల్ క్లీనప్ కింద ప్రతి నెలా ఒక రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నావికాదళానికి చెందిన 600 మందికి పైగా సర్వీస్, డీఎస్సీ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత



మృతుడి కుటుంబానికి సాయం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

అగనంపూడి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిల్లర వ్యాపారి కుటుంబానికి విశాఖ నగరానికి చెందిన స్పందన చేయూత ఫౌండేషన్ అండగా నిలిచింది. రాజమండ్రికి చెందిన ద్వారపూడి దుర్గ అగనంపూడిలో తోపుడు బండిపై పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడంతో స్పందించిన స్పందన చేయూత ఫౌండేషన్ చైర్మన్ ఈపూరి బుచ్చిరాజు రూ.11వేల నగదును మృతుని భార్య ధనలక్ష్మికి అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.వి.ఎల్.ఆనంద్, ప్రతినిధులు కిషోర్, గుదే సుశీలా గజేంద్రరావు, కిడిమి హనుమంతురావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆగే వరకు ఉద్యమం



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆగే వరకు కార్మికుల ఉద్యమాలు ఆగవని పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద ఉన్న స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే దీక్షల్లో 793వ రోజు శనివారం సంస్థకు చెందిన ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టీఎం కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామన్నారు.

ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బీఎస్సీ మైక్రోబయాలజీ విద్యార్థులు 30మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యా రు. వీఎస్‌పీజెడ్‌లోని లీ ఫార్మా సంస్థ క్వాలిటీ ఎస్యూరెన్స్ మేనేజర్ కె.స్వామి శేఖర్, హెచ్‌ఆర్ మేనేజర్ టి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ లు జరిగాయి. ఇంటర్వ్యూల్లో ఎంతమంది అర్హత సాధించారో త్వరలోనే కంపెనీ ప్రకటించనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు.

అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం మల్కాపురానికి చెందిన ఎస్.మహేష్ అనేదాత లక్ష 1016 రూపాయిలు విరాళం ఇచ్చారు. సింహగిరిపై మే ఐ హెల్ప్‌యు కేంద్రంలో దేవస్థానం తరపున దాతకు సూపరింటెండెంట్ పద్మనాభరాజు బాండ్ అందజేశారు.



చెరుకు రసంతో కాస్త ఉపశమనం



జనాలు లేని చినగంట్యాడ రోడ్డు



పెదగంట్యాడలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

భానుడి కర్ఫ్యూ

- వారం రోజులుగా సెగలు పుట్టిస్తున్న ఎండలు
- ఉష్ణతాపానికి అల్లాడుతున్న జనం
- రహదారులన్నీ నిర్మానుష్యం



వెలవెలబోతున్న గాజువాక కూడలి

పెదగంట్యాడ: భానుడు భగ్గుమంటున్నాడు. వారం రోజులుగా సెగలు పుట్టిస్తున్నాడు. ఎండల దెబ్బకు జనం అల్లాడిపోతున్నారు. రోడ్లపైకి రావడానికి భయపడిపోతున్నారు. దీంతో గాజువాక పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 గంటలు దాటితే రహదారులన్నీ నిర్మానుష్యంగా మారడంతో కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తోంది. అర్జెంట్ పనులపై ఒకరిద్దరు తిరుగుతున్నా ఉపశమనం కోసం చల్లని పానీయాల కోసం పరుగులు పెడుతున్నారు. కొబ్బరి బొండాలు, కూల్‌డ్రింక్‌లు, జ్యూస్ సెంటర్లు, షరబత్ బళ్ల వద్ద క్యూ కడుతున్నారు.

విద్యార్థుల అవస్థలు

పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు మధ్యాహ్నం పరీక్ష రాసి ఇంటికి రావడానికి అవస్థలు పడుతున్నారు. మరో పక్క ఒంటి పూట బడుల కారణంగా విద్యార్థులదీ ఇదే పరిస్థితి.

‘ఉక్క’రిబిక్కిరి

భానుడి ప్రతాపంతో ఇళ్ల వద్ద ఉన్న వారు సైతం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఫ్యాన్ నుంచి కూడా వేడిగాలులు రావడం, సాయంత్రమైనా చల్లబడకుండా రాత్రి వరకు సెగలు తగలడంతో అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచే ఎండలు మండిపోవడం, ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో హడలిపోతున్నారు. ఈ నెలలోనే ఇలా ఉంటే మే నెలలో పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

వారం రోజుల నుంచి గాజువాక నియోజకవర్గ పరిధిలో నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	ఉష్ణోగ్రత (సెల్సియస్‌లలో)
09-04-2023	35.8 డిగ్రీలు
10-04-2023	37.2 డిగ్రీలు
11-04-2023	38.6 డిగ్రీలు
12-04-2023	39.6 డిగ్రీలు
13-04-2023	40.2 డిగ్రీలు
14-04-2023	39.6 డిగ్రీలు
15-04-2023	41.4 డిగ్రీలు

వెలవెలబోతున్న రహదారులు

గాజువాక నియోజకవర్గ పరిధిలోని కొత్త గాజువాక, పాత గాజువాక, పెదగంట్యాడ జంక్షన్, చినగంట్యాడ జంక్షన్, వుడా కాలనీ తదితర ప్రాంతాలు నిత్యం జనంతో రద్దీగా కనిపిస్తాయి. అయితే వారం రోజుల నుంచి ఈ ప్రాంతాలు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. మార్కెట్లు కూడా వెలవెలబోతున్నాయి. వేకువ జామునే జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చి తమకు కావాల్సిన సామగ్రి తీసుకుని 10గంటల లోపే ఇళ్లకు తిరిగి వెళ్లిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చే వారు తప్ప మిగిలిన వారు కనిపించడం లేదు.

క్రీడామైదానాలు ఖాళీ

క్రీడామైదానాలు సైతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని ఆదర్శగ్రౌండ్ నిత్యం క్రీడాకారులతో కళకళలాడుతూ ఉంటుంది. ఆ క్రీడామైదానంలోనూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక్కరూ కనిపించకపోవడం విశేషం. రోజూ 35 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వృద్ధులు, చిన్నపిల్లలు విలవిల్లాడిపోతున్నారు. మరో వారం రోజుల పాటు ఉష్ణోగ్రతలు ఇలాగే ఉంటాయని, ఎండలో ఎవరూ బయటకు రావద్దని వాతావరణ నిపుణులు తెలియజేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లే వారు వడ దెబ్బ తగలకుండా ఉండేందుకు జాగ్రత్తలు వహించాలని సూచిస్తున్నారు.

11 నుంచి 4 గంటల వరకు బయటకు వెళ్లొద్దు



ఎండలు బాగా ఎక్కువగా ఉన్నందున ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ బయటకు వెళ్లకుండా ఉంటే మంచిది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు వాటర్, గ్లూకోజ్, ఓఆర్‌ఎస్ వంటివి తీసుకెళ్లాలి. గొడుగులు గానీ, టోపీలు గానీ పెట్టుకోవాలి. కాటన్, తెలుపు గానీ, లేత రంగుల దుస్తులు వదులుగా ఉండేలా ధరించాలి. ఎండలో నుంచి ఇంటికి వచ్చిన తర్వాత తలనొప్పి గానీ, వాంతులు గానీ, జ్వరం వస్తే, వడ దెబ్బగా భావించి సమీపంలోని వైద్యులను వెంటనే సంప్రదించాలి.

– డాక్టర్ అన్నపూర్ణ, వైద్యాధికారి, పెదగంట్యాడ పీహెచ్‌సీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు సూచించారు. వార్డు పరిధిలోని గిరిజా కాలనీలోని యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా రోగాలు ప్రబలుతున్నాయని, వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రియదర్శిని కాలనీ మీదుగా ర్యాలీ సాగింది. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సతీష్, గిరి, గండి అప్పలరాజు, జానా సతీష్, పెంద్రరాజు, అవంతి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



సీపీ త్రివిక్రమ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయి శ్రీకాంత్ వర్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: నూతన అధికారులను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయి శ్రీకాంత్ వర్మను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో ‘విషు’ పండగ

- విశేష అలంకరణలో అయ్యప్ప
- స్వామికి నవధాన్యాలు, కూరగాయల నివేదన



అయ్యప్ప స్వామికి నివేదించిన నవధాన్యాలు, కూరగాయలు

అక్కిరెడ్డిపాలెం: కేరళీయుగ ఉగాది ‘విషు’ సందర్భంగా అయ్యప్పస్వామి విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని కేరళీయులు నవధాన్యాలు, కూరగాయలను స్వామికి నివేదించారు. స్వామిని పంచామృతాలతో, గంధంతో అభిషేకించి, పట్టువస్త్రాలతో, పుష్పాలతో అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నాయుడు, కార్యదర్శి శేషగిరిరావు పాల్గొన్నారు. మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం ప్రతినిధులు ప్రసాద వితరణ చేశారు.

ఇంటింటా నీరాజనం



అగనంపూడి గళ్లవానిపాలెంలో కరపత్రాలు అందిస్తున్న కన్వీనర్లు, గృహసారథులు



ధర్మాలవీధిలో స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న కన్వీనర్లు, గృహ సారథులు



87వ వార్డులో మహిళకు బ్రోచర్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి జనం నీరాజనాలు పలుకుతున్నారు. గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలపై మహిళల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఇంటికి స్టిక్కర్లను అంటించారు.

➡ 68వ మిందిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఈటి సురేష్, చిట్టిబాబు, రొక్కం వెంకట్రావు, గుర్రం రాజేష్, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

➡ 69వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలపై అభిప్రాయాలను సేకరించారు. విరోతి రాము, కాకి అప్పలరెడ్డి, ఈగలపాటి యువశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

➡ 70వ వార్డు దశమికొండ కాలనీలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. చట్టి అప్పలరాజు, అప్పలనాయుడు, రంగాల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: 85వ వార్డు పెదమడకలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జేసీఎస్ గాజువాక క్లస్టర్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. గెద్దాడ సత్యవతి, కరణం సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

➡ 79వ వార్డు ప్రశాంతినగర్ సచివాలయ పరిధిలోని గళ్లవానిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, సీనియర్ నాయకులు జెర్రిపోతుల సోమునాయుడు, గురు మోహన్, మామిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ 79వ వార్డు ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో లంకెలపాలెం శివారు కాలనీల్లో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుందరపు అప్పారావు, కర్రి నరసింగరావు, కాతా నూకేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ 88వ వార్డు కాపు జగ్గరాజుపేట సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంధ్రెడ్డి కనకమహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు నమ్మి ప్రసాద్, లక్ష్మి, మాడిశ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: 86వ వార్డు రాజీవ్‌నగర్‌లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. చేగొండి శ్రీనివాస్, వాడపల్లి రామచంద్రరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

➡ 87వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కోమటి రమాదేవి, జెర్రిపోతుల ఈశ్వరరావు, బలిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: 75వ వార్డు పరిధిలోని మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ధర్మాలవీధి, గొందేశి వీధి తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. ఇళ్లకు, ఫోన్లకు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో కన్వీనర్ గొందేశి సుమన్‌రెడ్డి, గృహ సారథులు గొందేశి మంగరాజు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేత, హస్తకళా ప్రదర్శనకు విశేష స్పందన



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన సారంగపూర్ బొమ్మలు

ఉక్కునగరం: స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. భావనా రుషి హస్త కళా కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి ఏర్పాటు చేసిన ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వస్తువులను అందుబాటులో ఉంచారు. పోచంపల్లి, నారాయణ పేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ చీరలు మహిళలను ఆకట్టుకుంటున్నాయి. కాంతా వర్క్స్ కాటన్, భాగల్‌పూర్ సిల్క్, చాందిని సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్‌తో పాటు నిర్మల్ జిల్లా సారంగపూర్ బొమ్మలు, చెక్క వస్తువులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిర్వాహకులు సింహాద్రి, సురేష్ మాట్లాడుతూ ఈ నెల 23 వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



లంకా మైదానం వద్ద శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక లంకా మైదానం వద్ద విశ్వ హిందూ పరిషత్ నేతృత్వంలో హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు బైక్ ర్యాలీని ప్రారంభించారు. నర్సింగరావు మాట్లాడుతూ గాజువాక నుంచి ప్రారంభమైన ర్యాలీ పార్క్ హోటల్ వరకు సాగుతుందన్నారు. అక్కడి నుంచి 10 వేల మందితో శోభాయాత్ర ప్రారంభమై కాళీ మాత గుడి వరకు సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకర్రావు, నాగేశ్వరరావు, ప్రకాష్, పైడిరాజు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కన్వీనర్‌గా రమణారావు



జి.వి.రమణారావు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ జిల్లా శాఖ బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కన్వీనర్‌గా స్టీల్‌ప్లాంట్ ఎం.ఎం.ఎస్.ఎం విభాగం ఉద్యోగి జి.వి.రమణారావు నియమితులయ్యారని సంఘం గౌరవ అధ్యక్షుడు పి.చిన్నారావు శుక్రవారం ప్రకటించారు. ఆటోనగర్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ వద్ద గల సంఘం కార్యాలయంలో చిన్నారావు నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉండవల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసా వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్



పెదగంట్యాడ జంక్షన్‌లో అగ్నిమాపకదళ విన్యాసాలు

పెదగంట్యాడ: అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ పి.నాగేశ్వరరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ జంక్షన్ నుంచి బీసీ రోడ్డు మీదుగా కొత్త గాజువాక వరకూ శనివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. వ్యాపారులు దుకాణాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలను అమర్చుకోవాలని సూచించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాకుండా వైరింగ్ చేయించుకోవాలన్నారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక దళ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 66వ వార్డులో పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ శనివారం పరిశీలించారు. బీసీ రోడ్డు లో నూతనంగా నిర్మిస్తున్న సెంట్రల్ పోల్స్‌ను, డివైడర్ పనులను పరిశీలించారు. కణితిరోడ్డులో కబరస్థాన్ వద్ద కల్వర్టు పనులను పరిశీలించారు. పనుల్లో జాప్యం జరగకుండా, నాణ్యత లోపం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ విధానాలు అప్రజాస్వామికం



ప్రచార భేరి యాత్రలో మాట్లాడుతున్న వామపక్ష నాయకుడు రాంబాబు

అక్కిరెడ్డిపాలెం: ప్రధాని మోదీ విధానాలు అప్రజాస్వామికమని సీపీఐ, సీపీఎం నాయకులు ఎం.రాంబాబు, కసిరెడ్డి సత్యనారాయణలు విమర్శించారు. ప్రచారభేరి పాదయాత్రలో భాగంగా శనివారం చైతన్యనగర్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచార భేరి యాత్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్షపార్టీల నేతలు అప్పారావు, విష్ణుమూర్తి, లోకేష్, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హృదయాలను హత్తుకున్న నాటకాలు



కొత్త పరిమళం నాటకంలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: మూడో ప్రపంచ యుద్ధ భయంతో క్షణక్షణం నరకయాతన పడుతూ బతుకీడుస్తున్న కాలంలో సరిహద్దు జీవన గాథే కథాంశంగా ప్రదర్శించిన కొత్త పరిమళం నాటకం, తల్లిదండ్రుల పేగు బంధంపై ప్రదర్శించిన మనసున మనసై నాటకం ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్నాయి. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో ఐదో రోజు ప్రదర్శించిన రెండు నాటకాలు ప్రేక్షకుల మన్ననలు పొందాయి. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం ఈ పోటీలను కస్టమ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్, వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్మెస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ట్రస్టీ పైడా కృష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

తొలి ప్రదర్శన: ‘కొత్త పరిమళం’

శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం వారు కొత్త పరిమళం నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. మూడో ప్రపంచ యుద్ధ భయంతో రగిలిన విద్వేశాలను కళ్లకు కట్టినట్టుగా చూపారు. మనుషుల్లో మానవత్వం మంటగలిసిపోయి జాతి, మతం విద్వేషాలతో దేశాలు రగిలిపోతున్న క్షణాలు.. కన్నీళ్లు పెట్టేలా నటీనటుల ప్రతిభకు పట్టం కట్టారు. జాతి, మతద్వేషాలను అంతం చేసే మానవత్వ విశ్వరూప సౌందర్యం అనే కొత్త పరిమళంతో హద్దులు, సరిహద్దులు లేని ప్రపంచాన్ని భావితరాలకు అందించాలనే ఇతివృత్తంతో ప్రదర్శించిన ఈ నాటకానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. కరతాళ ధ్వనులతో నటీనటులకు కృతజ్ఞతలు తెలిపారు. కె.కె.స్వామి నాటకాన్ని రచించగా.. బి.ఎం.ఎస్ పట్నాయక్ దర్శకత్వం వహించారు.

రెండో ప్రదర్శన: ‘మనసున మనసై’

ఏలూరుకు చెందిన హేలాపురి కల్చరల్ అసోసియేషన్ వారిచే మనసున మనసై నాటకం ప్రదర్శించారు. చిన్నతనంలో బడికి వెళ్లిన బిడ్డ తిరిగి ఇంటికొచ్చే వరకూ ఎదురుచూసే తల్లిదండ్రులు, పెరిగి పెద్దవాడయ్యాక సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ తలకొరివి పెట్టడానికి రోజుల తరబడి మార్చురీ బాక్స్‌లో పెట్టి ఎదురుచూసే పరిస్థితుల ఇతివృత్తంగా ప్రదర్శించిన ఈ నాటకం ప్రేక్షకుల మనసును కదిలించింది. చింతల మల్లేశ్వరరావు, పి.కృష్ణ హితేష్‌లు నాటకాన్ని రచించగా.. ఎం.డి.ఖాజావల్లి దర్శకత్వం వహించారు. రెండు గొప్ప నాటకాలను తిలకించామంటూ ప్రేక్షకులు ప్రశంసించారు.

అభాగ్యులకు ఆశ్రయం

అల్లిపురం: కేజీహెచ్‌లో నలుగురు అభాగ్యులు దిక్కులేక ఎవరో తీసుకువచ్చి చేర్పించటంతో వైద్యం పూర్తయినా వెళ్లలేని పరిస్థితిలో ఉంటే ఆస్పత్రి సిబ్బంది మమత ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమతకు విషయం తెలియజేశారు. ఆమె శనివారం వారిని ఆస్పత్రి సూపరింటెండెంట్ సహకారంతో పెందుర్తి లయోలా హోమ్‌లో చేర్పించి ఆశ్రయం కల్పించారు.